క్లుప్తంగా

జువ్వలపాలేనికి ఆర్టీసీ సర్వీసును పునరుద్ధరించాలి



తెనాలి: కొల్లూరు మండల గ్రామం జువ్వల పాలెం గ్రామానికి నైట్ హాల్టు బస్సును పునరుద్ధరించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం తెనాలి ఆర్టీసీ బస్‌స్టేషను అధికారులకు వినతిపత్రం సమర్పించారు. తెనాలి డిపో నుంచి జువ్వలపాలేనికి ఒక ఆర్టీసీ బస్సు ప్రతిరోజూ మూడు ట్రిప్పులు నడుస్తోందని తెలియజేశారు. గతంలో ఉన్న నైట్ హాల్టు బస్సు సర్వీసును రెండేళ్ల క్రితం రద్దు చేసినట్టు తెలిపారు. రాత్రిపూట తెనాలి నుంచి వచ్చేవారికి, ఉదయాన్నే దూర ప్రాంతాలకు వెళ్లేవారికి నైట్‌హాల్టు బస్సు ఎంతో సౌకర్యంగా ఉండేదన్నారు. చెన్నై వెళ్లే పినాకినీ ఎక్స్‌ప్రెస్‌కు లింక్‌గా జువ్వలపాలెం, సమీపంలోని ఆరు గ్రామాల ప్రయాణీకులకు నైట్‌హాల్టు బస్సు ఉపకరించిందని తెలియజేశారు. ఆ సర్వీసు రద్దయినప్పట్నుంచి రాత్రిపూట తెనాలి నుంచి రావటానికి, తెల్లవారుజామునే బయట ఊళ్లకు వెళ్లేందుకు ఆటోలకు ఎక్కువ డబ్బులు పెట్టాల్సి వస్తోందని వివరించారు. తమ గ్రామానికి నైట్‌హాల్టు బస్సు పునరుద్ధరించాలని కోరారు. గ్రామానికి చెందిన వి.వెంకట్రామయ్య, ములకా శివసాంబిరెడ్డి ప్రభృతులు పాల్గొన్నారు.

వీపఏకు సన్మానం

వేమూరు: ప్యాపర్రు గ్రామ వ్యవసాయ సహాయకుడు బుడ్డా మణికంఠకు పదోన్నతి పొందడం జరిగిందని మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి తెలిపారు. ప్యాపర్రు రైతు సేవా కేంద్రంలో శుక్రవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణాధికారి పదోన్నతి పొందడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.హేమ చంద్ర శ్రీనివాస్, గ్రామ పెద్దలు అచ్చన వెంకటేశ్వరరావు, వన్నా బెనర్జీ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

అమర్తలూరు(వేమూరు): ఆర్‌టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయలపాలయ్యారు. పోలీసుల కథనం మేరకు.. ద్విచక్ర వాహనంపై షేక్ అబ్దుల్, షేక్ రహీమ్ తెనాలి నుంచి భట్టిప్రోలు వెళ్తున్నారు. చెరుకపల్లి నుంచి తెనాలి వెళ్తున్న ఆర్టీసీ బస్సు అమర్తలూరు మండలంలోని కూచిపూడి లాకు వద్ద ఉన్న మలుపులో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్‌ఐ జానకి అమర్‌వర్ధన్ శుక్రవారం తెలిపారు. 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వం వైద్య శాలకు తరలించారు. వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించడం జరిగిందని ఆయన తెలిపారు. కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

మద్యం బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

చుండూరు(వేమూరు): మద్యం బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేసామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుండూరు మండలంలోని వేటపాలెం గ్రామానికి చెందిన బెల్టు షాపు నిర్వాహకుడు మద్యం బాటిల్ విక్రయిస్తుండగా పట్టుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. అతని వద్ద 8 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అక్రమ మద్యం విక్రయం చేస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని సి.ఐ రవికుమార్ తెలిపారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఉండాలి

ఏఎన్‌యూ: ప్రస్తుతం ఎంతో కీలకంగా మారిన సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజర్, సెక్యూరిటీ కన్సల్టెంట్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం సైబర్ సెక్యూరిటీపై సదస్సు నిర్వహించారు. వెంకటేశ్వరరెడ్డి ప్రసంగిస్తూ సైబర్ దాడులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ప్రపంచం మొత్తం సైబర్ సెక్యూరిటీ అంశాలపై చాలా ఆందోళనకర పరిస్థితులు నెలకొంటున్నాయని చెప్పారు. అనంతరం ఉపకులపతి ఆచార్య కే గంగాధర రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస వెంకటేశ్వర రెడ్డిని వీసీ సత్కరించారు. ప్రిన్సిపాల్ ఆచార్య సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

దీక్షాపరులకు సద్ది

బాపట్ల: బాపట్ల పట్టణంలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీసోమేశ్వరస్వామి దేవాలయంలో దీక్షాపరులకు సద్ది కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. తొలుత అయ్యప్పస్వామికి పడిపూజ చేపట్టి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ 19 సంవత్సరాలుగా సద్ది కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆదేవదేవుడు అవకాశం కల్పించటం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈకార్యక్రమంలో కొటికం సుబ్బారావు గురుస్వామి,గ్రామపెద్దలు కొండారెడ్డి అనిల్, మోర్ల సముద్రాలగౌడ్,పెద్ది సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా ఆక్సిజన్ ప్లాంట్

- మరమ్మతులకు నోచుకోక నిరుపయోగం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

రేపల్లె రూరల్: దాతలు సాయం నీరుగారిపోతోంది. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఎంతో మందికి ప్రాణ వాయువును అందించిన ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ నిరాదరణకు గురవుతోంది. గత కొన్ని నెలల క్రితం మరమ్మత్తులకు గురైన ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్‌ను పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం నిరుపయోగంగా మారింది. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2022 జనవరి 21న రేపల్లె రెడ్‌క్రాస్ సొసైటీ, హిందుస్థాన్ కోకాకోలా బేవరేజస్ సంస్థల సహకారంతో ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్‌ను నెలకొల్పారు. నాటి నుంచి అనేక విధాలుగా ప్రాణ వాయువును అందిస్తూ సేవలు అందిస్తున్న ఆక్సిజన్ జనరేషన్ కొన్ని నెలల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో రోగులకు సకాలంలో ప్రాణ వాయువు అందక ఇబ్బందులు పడుతున్నారు.

కోవిడ్ విపత్కర సమయంలో ప్లాంట్ సేవలు

కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణవాయువు సకాలంలో అందక ఎందరో మృత్యువుతో పోరాడారు. తీరంలో సైతం కోవిడ్ భారినపడి పట్టణంలో సరైన వైద్య సేవలు లేక వ్యాధి భారిన పడిన వారిని తెనాలి, గుంటూరులోని క్వారంటైన్‌కు పంపి చికిత్స అందించి, కోలుకున్న పరిస్థితులు ఉన్నాయి. అయితే ఇక్కడే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించి కాపాడే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ పలువురికి ప్రాణవాయును అందించి ప్రాణదాతగా నిలిచింది. నేటికి ఆయాసం, ఉబ్బసం వంటి వ్యాధులతో బాధపడే వారికే కాకుండా ఆపత్కాలంలో వైద్యశాలకు వచ్చే వారికి ఆక్సిజన్ అందిస్తూ ప్రాణాలను నిలుపుతోంది. కోవిడ్ సమయంలో రేపల్లెలో ఏర్పాటు చేసిన క్వారంటైన్‌లో చికిత్సలు పొందిన పలువురికి ఆక్సిజన్‌ను అందించింది.



ప్రభుత్వ వైద్యశాలలోని ఆక్సిజన్ ప్లాంట్

కూటమి నేతల నిర్లక్ష్యం..

మరమ్మతులకు గురైన ప్రాణవాయువు ప్లాంట్ విషయంలో నేటి కూటమి నేతలు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నెలలు గడుస్తున్నా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు, ప్రజా సంఘాలు బహిరంగంగానే ఆరోపిస్తున్నాయి. ప్రస్తుతం శీతాకాలంలో ఆయాసం, ఉబ్బసంతో బాధపడే వారికి ప్రాణవాయువు అవసరం ఎంతో ఉంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి జనరేషన్ ప్లాంట్‌కు మరమత్తులు నిర్వహించి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం

వైద్యశాలలోని ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ మరమ్మతులకు గురైన అంశాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రస్తుతం వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులకు అవసరమైన ఆక్సిజన్ సిలిండర్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే ప్లాంట్‌కు మరమ్మతులు నిర్వహించి, వినియోగంలోకి తీసుకువస్తాం.

–సుధాకర్, సూపరింటెండెంట్, ప్రభుత్వ వైద్యశాల

గోవులను శ్రీశైలం గోశాలకు తరలిస్తాం

శానిటరి ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణంలో సంచరిస్తూ, రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ..పారిశుధ్యానికి అవరోధంగా మారిన గోవులను సురక్షితంగా గోశాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు శానిటరి ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు చెప్పారు. శ్రీశైలంలోని గోశాలను సందర్శించి శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలో ప్రధాన రహదారులపై సంచరిస్తున్న గోవుల యజమానులతో ఇప్పటికే పలుమార్లు మాట్లాడి నోటీసులు జారీచేశామన్నారు. పలు గోవులను ఇప్పటికే శ్రీశైలం గోశాలకు తరలించామన్నారు. గోవులను తరలించే సమయంలో కొంతమంది యజమానులు తమ గోవులను బయటకు వదలకుండా సంరక్షించుకుంటామని తెలియజేసి గోశాలకు తరలించకుండా అడ్డుకున్నారన్నారు. సమస్య పునరావృతమై గోవులు ప్రధాన రహదారులపైకి వచ్చి సంచరిస్తున్నాయన్నారు.



శ్రీశైలం గోశాలను పరిశీలిస్తున్న రేపల్లె శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు

మరోమారు పూర్తిగా గోవులను శ్రీశైలం తరలించేందుకు నిర్ణయించి, యజమానులకు చివరిసారిగా నోటీసులు జారీ చేశామని చెప్పారు. ప్రధాన రహదారులపై సంచరించే గోవులను మరో రెండు రోజుల్లో గోశాలకు తరలించడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా యజమానులు తమ గోవులను రహదారులపైకి రానివ్వకుండా పర్యవేక్షించుకోవాలని చెప్పారు.

నగరేశ్వరస్వామి ప్రతిష్ఠా మహోత్సవం

రేపల్లె రూరల్: పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో వేంచేసియున్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం నగరేశ్వరస్వామి ప్రతిష్ఠా మహోత్సవాలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణంలో నాగేశ్వరస్వామి, సరస్వతీ, అభయాంజనేయ స్వామి, శిఖర బలపీఠ నంది విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలను వేద పండితులు నందివెలుగు బాలాజీ గురుకుల్ ఆధ్వర్యంలో కనుల పండువగా చేశారు. ఈ సందర్భంగా పలు పూజలు, విశేష అర్చనలు నిర్వహించి మహానైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మహిళలు లలితా సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



హోమాది పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

ఆలయాల్లో కార్తిక పూజలు



బాలాత్రిపుర సుందరి అమ్మవారు



గ్రామదేవత బూరుగులమ్మ

రేపల్లె రూరల్: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం పలు దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓల్డ్ టౌన్‌లోని ఉమామహేశ్వర స్వామి సమేత బాలాత్రిపుర సుందరిదేవికి, గ్రామదేవత బూరుగులమ్మకు ఉదయం నుంచే అభిషేకాలు నిర్వహించి, ఆలయ అర్చకులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. బూరుగులమ్మ ఆలయంలో మహిళలు కార్తిక దీపాలు వెలిగించి, రాహుకాల హారతులుపట్టి, చద్ది నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయాల కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. మండలంలోని మైనేనివారిపాలెంలోని చెన్నమేల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు లక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పోటుమెరక గ్రామంలోని వేంకటేశ్వరుని ఆలయంలో మహిళలు ప్రత్యేక భజనాధి కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు, పెదపులివర్రు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ శాంతకుమారి శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపల్లె రూరల్: రేపల్లె, గంగడిపాలెం ఫీడర్లలో మరమ్మతుల నేపథ్యంలో రేపల్లె పట్టణం, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వీవీ చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

కొల్లూరు(వేమూరు): విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని అసిస్టెంట్ ఇంజినీరు సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రావికింపాడు ఫీడరు పరిధిలోని గాంధీ నగర్, బోస్ నగర్, క్రాప, రావికింపాడు, కుచ్చెళ్లపాడు, అబ్బన గూడవల్లి, తాడిగిరి పాడు గ్రామాల్లో విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

వేమూరు: వ్యవసాయ విద్యుత్ లైన్ మరమ్మతులు కోసం విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు గోపి తెలిపారు. వేమూరు మండలంలోని 33–11 కె.వి సబ్ స్టేషన్ నుంచి పెరవలి వ్యవసాయ ఫీడర్‌పై పీరియాడికల్ మైంటెనెన్సు కింద పెరవలి, చావలి, కోడిపర్రు, పెనుమర్రు గ్రామాల్లో శనివారం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం కలదన్నారు.

పిచ్చి తీగలు తొలగించరూ.



విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పిచ్చి తీగలు

మండల కేంద్రంలోని గాంధీ నగర్‌లో విద్యుత్ స్తంభానికి పిచ్చి మొక్కలు ఎగబాకుతున్నాయి. ఆ మార్గంలో నడిచి వెళ్లేవారు పొరపాటున మొక్కలను తాకితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ పిచ్చి తీగలు స్తంభానికి అల్లుకుపోతున్నాయి. ఒక్కోసారి నిప్పు రవ్వలు కూడా పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పిల్లలు ఆడుకునే సమయంలో ప్రమాదాలు సంభవించకముందే విద్యుత్ శాఖాధికారులు స్పందించి తీగలు తొలగించాలని కోరుతున్నారు.

– భట్టిప్రోలు

కాల్వలో గుర్తుతెలియని మృతదేహం


బాపట్లటౌన్:మండలపరిధిలోని జమ్ములపాలెం సమీపంలో ఉన్న పాజేటి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం సాయంత్రం కొట్టుకువచ్చింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. 35–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వ్యక్తి శరీరంపై ఎరుపు రంగు నిక్కర్ ఉంది. ఈ మేరకు రూరల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సాంఘిక నాటకానికి దారిదీపం

కన్నెగంటి నాసరయ్య

- నాటకమే జీవితంగా శ్వాసించిన కళాకారుడు
- సాంఘిక నాటకం తేజోవంతం
- నేడు శతజయంతి సందర్భంగా...



కన్నెగంటి నాసరయ్య



1965లో గూడూరు పరిషత్‌లో 'భయం' నాటకానికి ప్రథమ బహుమతిని అందుకున్న 'జనతా ఆర్ట్ థియేటర్' నటీనటులు

తెనాలి: నటన ఒక తపోసాధనగా, రంగస్థలం ఆరాధన కేంద్రంగా జీవితాంతం నాటకాన్నే శ్వాసించిన కళాకారుడు కన్నెగంటి నాసరయ్య, పౌరాణిక పద్యనాటకాల యుగంలో సాంఘిక నాటకాన్ని తేజోవంతం చేశాడు. 'జనత'ను చైతన్యబాట నడిపించాడు. నాటకకళ, కళాకారుల కోసం కృషిచేశాడు. అయిదు దశాబ్దాలకు పైగా కళాసేవలో గుండెలనిండా సంతృప్తితో తనకంటూ ఏమీ లేకుండా నిశ్శబ్దంగా 'వెళ్లిపోయాడు'. ఈనెల 9న శతజయంతి సందర్భంగా ఆయన పరిచయం.

కళల తెనాలి ముద్దుబిడ్డ కన్నెగంటి నాసరయ్య

1924 నవంబరు 9న జన్మించారు. తల్లిదండ్రులు నాగరత్నమ్మ, శ్రీరాములు. నూనూగు మీసాల వయసులో దేశంలో జరుగుతున్న స్వాతంత్ర్య ఉద్యమం, అజాద్ హింద్ ఫౌజ్ నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాటం నాసరయ్యను ఆకర్షించాయి. 1942లో 'నేతాజీ నాట్యమండలి' బుర్రకథ దళాన్ని ఆరంభించాడు. అర్ధరాత్రివేళ రహస్యంగా పెట్రొమాక్స్ లైట్ల వెలుగులో దేశభక్తిపూరితమైన బుర్రకథను చెప్పటానికి ఆ రోజుల్లో ఎంత గుండె ధైర్యం ఉండాలి? నేతాజీ ఆదర్శంగా ఆయన సాహసాన్నే బుర్రకథగా ప్రజాసమూహంలోకి తీసుకెళ్లాడు. రౌద్ర రసోద్రేక భావనలతో ఒక ఫైర్‌బ్రిగేడ్‌లా సాగిన నాసరయ్య బృందం బుర్రకథ, ప్రజల నాడి పట్టింది.

నాటక దర్శకుడు వీర్రాజుతో పరిచయంతో నాసరయ్యను నాటకం కేసి చూశాడు. కళాపోషకుడు నన్నపనేని వెంకట్రావు సూచనపై తన నాట్యమండలిని 'జనతా ఆర్ట్ థియేటర్'గా మార్చాడు. ఇక ఆంధ్రదేశంలో ఒక నాటక ప్రభంజనం మొదలైంది. పౌరాణిక నాటకం వెలుగుతున్న రోజుల్లో నాసరయ్య సంస్థ సాంఘిక నాటకానికి పట్టం కట్టింది. కణ్వశ్రీ రచించిన 'ఇదా ప్రపంచం' నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. నిప్పులు కురిపించే పాత్రలో ప్రేక్షకులు నాసరయ్య నటవిశ్వరూపాన్ని చూశారు. జనం మెచ్చాక పరిషత్‌ల బహుమతులకు కొదవేముంటుంది. ఇతర పాత్రల్లో ఏవీఆర్, ఆచార్య, జాష్టి కోటేశ్వర రావు, కందుల రాజారావు, దాసరి సీతాకుమారి, సీహెచ్ వనజ, అనిశెట్టి సత్యవతి నటించారు. ఈ నాటకాన్ని విపరీతంగా ఆడారు. ఒక్కోచోట మూడునాలుగు రోజులు వరుస ప్రదర్శనలు ఇచ్చారు.

ఇక వరుసగా 'కులం లేని పిల్ల', 'పరివర్తన', 'భలే పెళ్లి', 'ఉలిపికట్టె', 'జైజవాన్', 'ఈనాడు', 'యుద్ధం' 'ఎవరిదీ తప్పు', 'ఆర్టిస్ట్', 'భయం', 'అన్నాచెల్లెలు', 'రైలుప్రమాదం' వంటి నాటక/నాటికలను ప్రదర్శించారు. ఎన్నో పరిషత్తుల్లో బహుమతులు అందుకున్నారు. 'ఇదా ప్రపంచం'లో చంద్రం, భయం నాటకంలో మేనేజరు పాత్రల్లో నాసరయ్య డైలాగులు హైలెట్. ఆరకమైన మాడ్యులేషన్‌తో మరే నటుడూ చెప్పలేదంటారు. 'భయం' నాటకాన్ని వందసార్లకు పైగా ప్రదర్శించారు. ప్రస్తుత సినీనటి అన్నపూర్ణ హీరోయిన్ పాత్రలో, శంకరాభరణం రాజ్యలక్ష్మి తల్లి సభారంజని పిచ్చిదాని పాత్రలో నటించారు.

నాటకాలను జనరంజకంగా ప్రదర్శించటంలోనూ నాసరయ్య, అనేక ప్రయోగాత్మక పద్ధతులను ప్రవేశపెట్టారు. రంగస్థల అలంకరణ, లైటింగ్, నాటకాన్ని నడిపే పద్ధతులు, సంభాషణ చెప్పే శైలి, ప్రదర్శన ఆరంభం నుండి చివరివరకు నవ్యరీతులను చొప్పించారు. సినిమాలకు చేసేటంతటి పబ్లిసిటీ చేసేవారు. నాటకంలోని ఫొటోలను, మరుసటిరోజు ప్రదర్శనకు ముందే నోటీస్‌బోర్డులో ఉంచేవారు. స్పాట్‌లైట్స్, కట్‌లైట్స్ ఫోకసింగ్‌లతో ప్రదర్శనను ఆకర్షణీయం చేసేవారు. తెనాలిలో కళాకారుల సంక్షేమానికి, వారి ఉనికిని కాపాడే దిశగా నాసరయ్య ఎంతో ప్రయత్నం చేశారు. 'తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం'కు ఓ ఇల్లు సమకూరింది. వీరితోపాటు ఎంతోమంది కళాకారులు నాటిన ఆ మొక్క కాలంతో పాటు ఎదిగింది.కళాకారులకు ఓ భవనంఏర్పాటైంది. సినీదర్శకుడు యోగి, నటీమణులు సభారంజని, అన్నపూర్ణ, 'చలిచీమలు' శైలజ, తెనాలి శకుంతల, శివపార్వతి నాసరయ్య స్కూలు నుండి వచ్చినవారే. సాంఘిక నాటకానికి దారిదీపంలా ప్రకాశించిన నాసరయ్యను 2004లో అజోవిభోకందాళం ఫౌండేషన్ 'నాటకరంగ సేవామూర్తి' పురస్కారంతో సత్కరించింది. 'నాటకరంగ కృషీవలుడు', 'కళారంగ శ్రామికుడు' వంటి బిరుదులెన్నో! చివరివరకు నాటకాన్నే శ్వాసించి, నాటకం కోసమే తపించిన నాసరయ్య 2008 ఆగస్టు 20న తుదిశ్వాస విడిచారు.

ప్రదర్శనే కాదు.. నటశిక్షణాలయం

నాటక ప్రదర్శనలకే కాదు...జనతా ఆర్ట్ థియేటర్‌ను నటశిక్షణాలయంగా ఎందరినో నటీనటులుగా తీర్చిదిద్దారు నాసరయ్య. అప్పట్లో నెహ్రూరోడ్డులో ఉండే, జనతా ఆర్ట్ థియేటర్ కార్యాలయం... నాటక కార్యశాల. వందలాది శిష్యుల్ని తయారుచేసి, పౌరాణిక నాటకాలకు దీటుగా సాంఘిక నాటకాన్ని ప్రజల ముందు నిలబెట్టారు. ఆయన కళారాధకుడే కాదు...కళాపోషకుడు కూడా! నాటకరంగ ఉద్ధరణకు తన స్థిరచరాస్తుల్ని హారతి కర్పూరంలా అర్పించారు. నిరుపేద కళాకారులను ఆదుకున్నారు. ఏ నాటకం సమాజం సహాయం కోరివచ్చినా శక్తిమేరకు తోడ్పడ్డారు. పేదకళాకారులు చనిపోతే నాసరయ్య నేతృత్వంలో సమాజదళమే, సొంత డబ్బులతో అంతిమ సంస్కారాలను నిర్వహించింది.

విద్యార్థినుల క్షేత్ర పర్యటన



సందర్శిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

బాపట్ల:బాపట్ల వ్యవసాయ కళాశాలను ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు, అధ్యాపక బృందం శుక్రవారం సందర్శించారు. విద్యార్థినులకు అవగాహన కోసం వర్మి కంపోస్ట్, మష్రూమ్, కల్టివేషన్ యూనిట్, హార్టికల్చర్, మొక్కల ఉద్యానవనం సందర్శించారు. పుట్టగొడుగుల పెంపకం, వర్మీ కంపోస్ట్ తయారీ, వ్యవసాయంపై అవగాహన కల్పించడం జరిగినది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.నాగమణి, డాక్టర్ అబ్దుల్ కలాం, డాక్టర్ గౌరీ, డాక్టర్ సుశీల, వెంకట లక్ష్మీ, కె.వి వసంత, ఎం. నైమిశా, నాగ మల్లేశ్వరి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపించి ఇళ్లు తొలగించాలి

నెహ్రూనగర్: గుంటూరు కాకుమానువారితోట(కార్మికశాఖకు చెందిన స్థలంలో) యానాది కాలనీలో యానాదులు 20 ఏళ్లగా నివాసం ఉంటున్నారని అటువంటి వారిని అర్ధాంతరంగా నగరపాలక సంస్థ సిబ్బంది ఇళ్లు తొలగిస్తామని వారిని భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదని పలువురు ప్రజా సంఘాల నాయకులు విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను గుంటూరులో కలసి వినతి పత్రం అందజేశారు. చిత్తు కాగితాలు ఏరుకుంటూ వచ్చిన ఆదాయంతో బతుకుతున్న వారి ఇళ్లను తొలగించడం ద్వారా వారు ఎక్కడికి వెళ్లలేని పరిస్థితిగా ఉందన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా స్థలం కాని, టిడ్కో ఇళ్లు మంజూరు చేసి వారికి పునరావాసం కల్పించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జీఆర్ భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు, తాడికొండ నరసింహారావు, విప్పర్ల ముత్తయ్య పాల్గొన్నారు.